
సాక్షి
బాపట్ల

బుధవారం । 18 । అక్టోబర్ । 2023



చిత్ర కళాప్రదర్శన ప్రారంభం

ఏఎన్‌యూ: చిత్ర కళాప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. వీసీ పి.రాజశేఖర్, రాష్ట్ర ప్రభుత్వ క్రియేటివ్, కల్చరల్ కమిషన్ సీఈఓ మల్లికార్జునరావు ప్రదర్శనను తిలకించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 4012 క్యూసెక్కులు విడుదల చేశారు.

అన్నపూర్ణాదేవిగా భువనేశ్వరి



నరసరావుపేట రూరల్: కోటప్పకొండలోని భువనేశ్వరి సమేత నీలకంఠేశ్వర స్వామి దేవస్థానంలో దసరా నవరాత్రుల్లో భాగంగా అమ్మవారు మంగళవారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

న్యూస్‌రీల్

గాయత్రీదేవిగా బాలచాముండేశ్వరి



అమరావతి: అమరావతి బాలచాముండిక సమేత అమరేశ్వరాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం బాల చాముండేశ్వరి అమ్మవారిని గాయత్రీదేవిగా అలంకరించారు. సహస్ర కుంకుమార్చన, దేవి ఖడ్గమాల, త్రిశల, లలితా సహస్రనామార్చన, శ్రీచక్రార్చనతోపాటుగా గాయత్రీదేవికి సంధ్యా సమయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలోని జ్వాలాముఖి, మహిషాసురమర్ధని అమ్మవార్లకూ ప్రత్యేక పూజలు చేశారు. శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ప్రత్యేక కుంకుమార్చనలు నిర్వహించారు. సీతాసమేత కోదండరామస్వామి దేవస్థానంలోని అద్దాలమహాల్‌లో వాసవీ కన్యకాపరమేశ్వరి అలంకారం చేశారు.

ఎన్నికల సామగ్రి సిద్ధం చేసే ప్రక్రియ ప్రారంభం

తనిఖీ చేసిన కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: ఈవీఎం, వీవీ ప్యాట్ల మొదటి దశ తనిఖీ ప్రక్రియను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి శివశంకర్ లోతేటి మంగళవారం పరిశీలించారు. ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న అగ్రికల్చర్ మార్కెట్ యార్డ్‌లో సోమవారం నుంచి ఎన్నికలలో వినియోగించే సామగ్రిని పరీక్షించి సిద్ధంచేసే ప్రక్రియ ప్రారంభమైన విషయం తెలిసిందే. అక్కడ ఏర్పాటు చేస్తున్న ప్రథమ చికిత్సా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు అందజేశారు. అలాగే సిబ్బందికి అందిస్తున్న భోజన వసతిని పరిశీలించారు. సిబ్బంది హాజరు వివరాలు సేకరించి, హాజరు పట్టికను పరిశీలించారు. సిబ్బంది సెల్ ఫోన్లను భద్రపరిచే గదిని తనిఖీ చేశారు. కలెక్టర్ వెంట గోడౌన్ ఇన్‌చార్జి, డ్వామా పీడీ జోసెఫ్‌కుమార్, మండల రెవెన్యు అధికారి ఆర్‌వీ రమణానాయక్ ఉన్నారు.

ప్రథమస్థానంలో తెనాలి ఆర్టీసీ డిపో

గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్



తెనాలిఅర్బన్: ఆదాయాన్ని సమకూర్చే విషయంలో జోన్‌లోనే తెనాలి ఆర్టీసీ డిపో ప్రథమ స్థానంలో ఉందని గుంటూరు రీజనల్ మేనేజర్ పి.రవికాంత్ పేర్కొన్నారు. తెనాలి డిపోను మంగళవారం ఆయన పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఉద్యోగులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రానున్న రోజుల్లో తెనాలి రాష్ట్ర స్థాయిలో మంచి స్థానంలో ఉండేలా చూడాలని సూచించారు. డిపోలో మరిన్ని వసతులు సమకూర్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఉద్యోగులు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ఎస్‌బీఐ రూపే కార్డులను అందరూ కలిగి ఉండాలని చెప్పారు. అనంతరం లక్ష్యాలు సాధించిన ముగ్గురు కండక్టర్లకు క్యాష్ అవార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్, ఉద్యోగులు పాల్గొన్నారు.

నేటి నుంచి వర్సిటీ వసతి గృహాలకు సెలవులు

ఏఎన్‌యూ(గుంటూరు): యూనివర్సిటీ కళాశాలలకు దసరా సెలవులు ఇవ్వడంతో వసతి గృహాలకు బుధవారం సాయంత్రం నుంచి సెలవులు ప్రకటించారు. పీజీ బాలుర, బాలికల హాస్టళ్లను ఈనెల 25 మధ్యాహ్నం నుంచి, ఇంజినీరింగ్ కళాశాల వసతి గృహాన్ని ఈనెల 26 మధ్యాహ్నం నుంచి తిరిగి ప్రారంభిస్తామని బాలుర, బాలికల వసతి గృహాల చీఫ్ వార్డెన్లు ప్రొఫెసర్ జి.నాగరాజు, ప్రొఫెసర్ వి.వెంకటరత్నమ్మ, ప్రొఫెసర్ పి.సిద్ధయ్య తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ఠ ధర రూ.2,000, గరిష్ఠ ధర రూ.3,200, మోడల్ ధర రూ.2,500 వరకు పలికింది.

రాయల్టీ లెక్క.. ఇక పక్కా

- ప్రైవేట్ సంస్థకు వసూలు బాధ్యత
- రెండేళ్ల కాంట్రాక్ట్ దక్కించుకున్న ఏఎంఆర్
- నెలకు రూ.10.50 కోట్లు ప్రభుత్వానికి
- ఇప్పటికే రాష్ట్రంలో ఆరు జిల్లాల్లో అమలు
- 30 శాతం పెరిగిన రాబడి
- అక్రమాలకు తావులేకుండా నూతన విధానం



లారీలతో తరలిస్తున్న గ్రానైట్ రాళ్లు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: రాయల్టీ పక్కాగా వసూలుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో పాటు బాపట్ల జిల్లాలో గ్రానైట్‌తో పాటు గ్రావెల్, రోడ్డుమెటల్, సిలికా, ఎర్రమట్టి నిత్యం రవాణా అవుతోంది. బాపట్ల జిల్లా పరిధిలో రేపల్లె, వేమూరు, బాపట్ల, అద్దంకి, పర్చూరు, చీరాల ప్రాంతాలనుంచి గ్రానైట్‌తో పాటు గ్రావెల్, మరం, మట్టి, మెటల్, సిలికా తదితర రవాణా చేస్తున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండిపడకుండా చూసేందుకు రాయల్టీ వసూలు బాధ్యతలను ప్రైవేటుకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

ఏఎంఆర్‌కు వసూలు బాధ్యత..

రాయల్టీ వసూలుకు ప్రభుత్వం ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది. టెండర్లలో పాల్గొన్న ఏఎంఆర్ కంపెనీ టెండర్ దక్కించుకుంది. ఇప్పటికే రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, ఈస్ట్ గోదావరి, వైఎస్సార్ కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లోను ఇదే విధానాన్ని కొనసాగిస్తున్నారు. తాజాగా ఉమ్మడి గుంటూరు జిల్లాను ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీకి అప్పగించారు. టెండర్ కాంట్రాక్ట్ కాలపరిమితి రెండేళ్లు కాగా ఇందుకుగాను కంపెనీ ప్రభుత్వానికి రూ.252.10 కోట్లు చెల్లించాలి. ఈ లెక్కన నెలకు రూ.10, 54, 41, 667 చెల్లించాల్సి ఉంది. ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాతిపదికన టెండర్లు ఖరారు చేయగా ప్రస్తుత బాపట్ల జిల్లాలోని రేపల్లె, వేమూరు, బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గాలు దీని పరిధిలోకి వచ్చాయి. ఈ విధానం వలన గతంలో వస్తున్న రాబడితో పోల్చితే ప్రభుత్వానికి 30 శాతం అదనంగా ఆదాయం సమకూరుతున్నట్లు మైనింగ్ అధికారులు చెబుతున్నారు.

రాయల్టీ ఇలా...

గ్రానైట్, మెటల్ ఇతరత్రా వాటికి క్యూబిక్ మీటర్ పద్ధతిలో రాయల్టీ, జీఎస్టీ, ఐటీ లు చెల్లించాల్సి ఉంటుంది. రోడ్డు మెటల్, రఫ్‌స్టోన్‌లకు రూ. 209 చెల్లించాల్సి ఉండగా గ్రావెల్, మరం, చిప్స్ తదితర వాటికి రూ.105, గ్రానైట్‌కు రూ.4,728 చెల్లించాల్సి ఉంది. గ్రానైట్ సైజు బట్టి రేటుమారుతుంది. ఇది కాకుండా జీఎస్టీ, ఐటీ అదనంగా చెల్లించాల్సి ఉంది.

చెక్‌పోస్టులు....

రాయల్టీ వసూలు కోసం ఏఎంఆర్ కంపెనీ జిల్లాలోని పెనుమూడి, పేటేరు, చందోలు, కర్లపాలెం, రెడ్డిపాలెం, వెదుళ్లపల్లి ప్రాంతాల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. ఇవి కాకుండా మొబైల్ టీములను ఏర్పాటు చేశారు.

నిబంధనలు ఇలా..

తాజా నిబంధనల ప్రకారం ఇప్పటికే మైనింగ్ విభాగం ద్వారా క్వారీ అనుమతులు ఉన్నవారు గ్రానైట్, మెటల్, గ్రావెల్ తరలింపు కోసం మైనింగ్ శాఖ ద్వారా తాము తరలించబోయే క్వాంటిటీ కి సంబంధించి ఏఎంఆర్ కంపెనీకి రాయల్టీ చెల్లించి వారి వద్ద నుంచి బిల్లులు తీసుకోవాల్సి ఉంటుంది. తరలింపు సమయంలో సదరు బిల్లులను ఏఎంఆర్ ఏర్పాటు చేసిన చెక్ పోస్టులలో చూపించి మెటీరియల్ లేదా ఇతరత్రా వాటిని తరలించవచ్చు.

ముందుగానే ఆదాయం



మైనింగ్ విభాగానికి అధికారులు, సిబ్బంది తక్కువగా ఉన్నందున పర్యవేక్షణ కొంత ఇబ్బందిగా మారింది. గ్రానైట్, ఇతర మెటీరియల్ రవాణాలో అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. రాయల్టీ వసూలు ప్రైవేటు కంపెనీకి అప్పజెప్పడం వల్ల ప్రభుత్వానికి ముందస్తుగానే నెలకు రూ.10 కోట్లు పైనే ఆదాయం సమకూరుతుంది. పైగా గతంతో పోలిస్తే 30 శాతం రాబడి పెరిగింది.

– రాజేష్, జిల్లా మైనింగ్ అధికారి

గవర్నర్‌కు వీడ్కోలు పలికిన కలెక్టర్, ఎస్పీ

చీరాల: గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్‌కు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ మంగళవారం వీడ్కోలు పలికారు. మూడు రోజుల పర్యటన ముగించుకుని రాజ్‌భవన్‌కు బయలుదేరిన ఆయనకు జ్ఞాపికలు అందించారు. వీడ్కోలు పలికిన వారిలో చీరాల ఆర్డీఓ పి.సరోజిని, తహసీల్దార్ జీవి గుంట ప్రభాకరరావు, ఎంపీడీఓ కె.నేతాజీ ఉన్నారు.



గవర్నర్‌కు జ్ఞాపిక అందిస్తున్న కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ జిందాల్

సనాతనం.. సచ్ఛీలతకు నిదర్శనం

- ఆధ్యాత్మిక అమృతవాహినిలో సుప్రభాతం ప్రత్యేకం
- ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం



గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న అజేయ కల్లం, ఎమ్మెల్యే కోన రఘుపతి, అద్దంకి తదితరులు

బాపట్ల అర్బన్: ఆధ్యాత్మిక అమృత వాహినిలో 'సుప్రభాతం' ప్రత్యేకమని, భగవంతుని మేల్కొలుపుగా విశ్వసించే సుప్రభాతాన్ని వాడుక భాషలోకి వ్యాఖ్యానం అందించిన ఆచార్య అద్దంకి శ్రీనివాస్ కృషి అభినందనీయమని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ముఖ్య సలహాదారు అజేయ కల్లం పేర్కొన్నారు. స్థానిక గౌతమ్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ ఆవరణలో 'శ్రీ వేంకటేశ సుప్రభాత వ్యాఖ్యానం' గ్రంథాన్ని ఆయన మంగళవారం రాత్రి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ... సనాతన ధర్మం గురించి, హిందుత్వ పునాదుల ఘనతను గురించి ఎంత చెప్పినా తక్కువే అని అభిప్రాయపడ్డారు. వేల ఏళ్ల కిందటే మానవ జీవిత పరమార్థం గురించి, భగవంతుని మనుగడ, దేవుని ఆరాధన గురించి ప్రపంచం మేల్కొనక ముందే స్పష్టంగా నిర్వచించిన ఘనత భారతీయ సనాతన ధర్మానిదే అన్నారు. ఏకత్వం నుంచి తిరిగి ఏకత్వాన్ని చేరుకునే ప్రక్రియలో భాగంగా మానవ జీవితంలోని వివిధ దశలు, ఆచారాలు, వ్యవహారాలు, త్యాగం, పరస్పర సహాయం సనాతన ధర్మంలో భాగమని వివరించారు. నిరంతరాయంగా కొనసాగుతున్న జీవన్మరణాలు, కర్మ ఫలాలను అనుసరించి పునర్జన్మను పొందడం, అంతిమంగా భక్తి మార్గం ద్వారా మోక్షం పొంది, తద్వారా భగవంతునిలో లీనమవడం వరకు అత్యంత పారదర్శకమైన స్పష్టమైన విధానాన్ని సనాతన ధర్మం అందించినట్లు తెలిపారు. బాపట్ల శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ బాపట్లకు ఒక ఇండోర్ ఆడిటోరియం ఆవశ్యకత ఉందని, వెయ్యి మంది కూర్చునే సామర్థ్యంతో రాబోయే రోజుల్లో నిర్మాణం చేపట్టనున్నట్లు వెల్లడించారు. పదేళ్లుగా సాహిత్య సాంస్కృతిక, సామాజిక సేవా రంగాలలో ధృతి సంస్థ చేస్తున్న కృషిని అభినందించారు. సుప్రసిద్ధ సాహితీవేత్త మెరుగుమిల్లి వెంకటేశ్వరరావు, బహు గ్రంథకర్త అంతర్వేది కృష్ణమాచార్యులు, ప్రముఖ సాహితీవేత్త బాలాంతపు వెంకటరమణ, సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు అంబటి మురళీకృష్ణ, సాహితీ వేత్త తట్టా జానకి గౌరవ అతిథులుగా హాజరై ప్రసంగించారు. గ్రంథకర్త డాక్టర్ అద్దంకి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇక్కడ లభించిన ఆదరణ సాహితీప్రియుల స్పందన అద్భుతమని కొనియాడారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ధృతి అధ్యక్షుడు కల్లం హరినాథ రెడ్డి మాట్లాడుతూ ఎందరో మహానుభావులు బాపట్లకు అందించిన ఖ్యాతిని, వారసత్వాన్ని, బాధ్యతలను ధృతి కొనసాగిస్తోందని చెప్పారు. కళా, సాంస్కృతిక, ఆధ్యాత్మిక రంగంలో ధృతి కృషి చేస్తోందని పేర్కొన్నారు. పుస్తకం తొలి ప్రతిని ధృతి కార్యదర్శి చాపల సుబ్రహ్మణ్యానికి అజేయ కల్లం అందజేశారు.

అగ్రి కల్చరల్ ఇంజినీరింగ్‌కు స్పాట్ కౌన్సెలింగ్

బాపట్ల: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో డాక్టరు ఎన్టీఆర్ కాలేజ్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజినీరింగ్ కళాశాల బాపట్ల, మడకశిరలో చేరేందుకు స్పాట్ కౌన్సెలింగ్ అవకాశం కల్పించారని డీన్ డాక్టరు డి.డి.స్మిత్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 26వ తేదీన గుంటూరు లాంలో కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు. వివరాలకు 9989625205లో సంప్రదించాలని కోరారు.

సుస్థిరాభివృద్ధిలో లక్ష్యాలు చేరుకోవాలి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషా పక్కన జెడ్పీ సీఈఓ మోహన్‌రావు

బాపట్ల: సుస్థిరాభివృద్ధిలో లక్ష్యాలు చేరుకోవడానికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై జిల్లాస్థాయి అధికారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా జీవించడానికి అందుబాటులో ఉన్న వనరులను సమర్థంగా వినియోగించుకునేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా ప్రతి పంచాయతీలో జల వనరులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. బాలబాలికలలో అక్షరాస్యత పెరగాలని చెప్పారు. విద్యా బోధనలో తప్పనిసరిగా ప్రమాణాలు పాటించాలని సూచించారు. 19 ప్రభుత్వ శాఖలకు 667 లక్ష్యాల ప్రమాణాలు నిర్దేశించినట్లు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు సుస్థిరాభివృద్ధి వైపు బాపట్ల జిల్లా అడుగులు వేసేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. లక్ష్యాల సాధన కోసం 25 మండలాలకు లైజనింగ్ అధికారులు, నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. సత్ఫలితాల కోసం క్షేత్రస్థాయిలో ప్రతి పంచాయతీకి ఫెసిలిటేటర్లను ఇప్పటికే నియమించినట్లు వెల్లడించారు. 2022–23 ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిని పంచాయతీల వారీగా ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాలని ఆయన తెలిపారు. సమావేశంలో గుంటూరు జెడ్పీ సీఈఓ మోహన్‌రావు పాల్గొన్నారు.

పేదలకు నాణ్యమైన వైద్యం



అత్యవసర విభాగం ప్రారంభోత్సవ సభలో మాట్లాడుతున్న మంత్రి రజిని, వేదికపై ఎమ్మెల్యే బొల్లా

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాల ఆవరణలో రూ.2.10 కోట్లతో నిర్మించిన అత్యవసర చికిత్స విభాగం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావుతో కలిసి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోనూ వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు విలేజీ హెల్త్ క్లినిక్‌లు, ఫ్యామిలీ డాక్టర్ వంటి వినూత్న కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం విజయవంతంగా నడుస్తోందని చెప్పారు. వినుకొండలో 30 పడకల వైద్యశాలకు అనుసంధానంగా త్వరలోనే 100 పడకల ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. పల్నాడు జిల్లాలో రూ.500 కోట్లతో పిడుగురాళ్ల వద్ద మెడికల్ కళాశాల నిర్మాణంలో ఉన్నట్లు వివరించారు. మాచర్లపురంలో రూ.475 కోట్లతో త్వరలోనే మెడికల్ కళాశాలను అందుబాటులోకి తెస్తామన్నారు. ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ సహకారాలతో ఆరోగ్య శాఖ మంత్రి పర్యవేక్షణలో వినుకొండలో ట్రామా కేర్ సెంటర్, వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామన్నారు. వినుకొండ అభివృద్ధిలో పాలుపంచుకున్న మంత్రి రజినికి కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తెలుగుదేశం పార్టీ నాయకులు ఆస్పత్రిని బందెలదొడ్డిగా మార్చారని, పందులు సంచరిస్తున్న ఆస్పత్రిని అభివృద్ధి చేసి మూడుసార్లు అవార్డులు అందుకున్న ఆస్పత్రిగా రికార్డు సృష్టించామన్నారు. ఈపూరు మండలంలో రూ.6 కోట్ల నిధులతో నూతన ఆస్పత్రి నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్, డీఎంహెచ్‌ఓ హరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఆరె సామ్రాజ్యం, మార్కెట్‌యార్డు చైర్మన్లు బత్తుల వెంకటేశ్వర్లు యాదవ్, చుండూరి వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ సభ్యులు విజయలక్ష్మి రాజా, జిల్లా కోఆప్షన్ మెంబరు గుండాల స్వెనోమ్, మున్సిపల్ వైస్ చైర్మన్ తెల్లాకుల రాజేష్‌ఖన్నా, పట్టణ పార్టీ అధ్యక్షులు పీఎస్ ఖాన్, పార్టీ మండల అధ్యక్షులు దండు చెన్నయ్య, వార్డు కౌన్సిలర్లు పాపసాని బ్రహ్మయ్య, ఎంఎస్‌కే బాషా, రెడ్డి నాగపద్మ, కొత్తమాసు శివ, ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అబ్దుల్ రజాక్, డాక్టర్ లీలానందిని, డాక్టర్ సౌమ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త కార్యాలయం పరిధిలో వైద్య ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించనున్నట్లు వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ సుబ్రహ్మణ్య రాజు మంగళవారం తెలిపారు. ఫార్మాసిస్టు, ల్యాబ్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్, థియేటర్ అసిస్టెంట్, జనరల్ డ్యూటీ అటెండెంట్, పోస్టుమార్టం అసిస్టెంట్ ఉద్యోగాలకు అర్హత ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 24వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఆవరణలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ కార్యాలయంలో అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు గుంటూరు.ఏపీ.జీవోవి.ఇన్ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని కోరారు.

రబీకి సమాయత్తంపై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: రైతులను రబీ సాగుకు సమాయత్తం చేయాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి కోరారు. నగర శివారుల్లోని లాంలోని వర్సిటీ సమావేశ మందిరంలో రబీ సాగు సమాయత్తంపై వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. సమావేశానికి విస్తరణ సంచాలకుడు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి అధ్యక్షత వహించారు. వీసీ మాట్లాడుతూ ఉష్ణోగ్రతలలో తేడాల వలన, అకాల వర్షాల వలన చీడపీడల ఉధృతి పెరగవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు సరైన సమయంలో కచ్చితమైన సాంకేతిక సలహాలను వ్యవసాయ శాఖ అధికారులకు, ఆర్‌బీకే సిబ్బందికి, రైతులకు అందించాలని సూచించారు. పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి మాట్లాడుతూ విస్తరణ శాస్త్రవేత్తలు పరిశోధన అంశాలను పొలాల్లో పరిశీలించి స్పష్టమైన అభిప్రాయాలను పరిశోధన శాస్త్రవేత్తలకు అందించాలని చెప్పారు. కార్యక్రమంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి ప్రధాన శాస్త్రవేత్తలు ఎస్‌వీ సాయిప్రసాద్, పి.సంజనారెడ్డి, టి. భూపతి మాట్లాడారు.

తూనికలు, కొలతలశాఖలో మార్పులపై అవగాహన

జాయింట్ కంట్రోలర్ మాధురి

బాపట్ల: తూనికలు, కొలతలశాఖలో వచ్చే మార్పులపై వ్యాపారులు పూర్తిగా అవగాహన కలిగి ఉండాలని ఆ శాఖ జాయింట్ కంట్రోలర్ మాధురి పేర్కొన్నారు. బాపట్ల తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ మీటింగ్ హాలులో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బొమ్మిశెట్టి రత్నగుప్తా ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో తూనికలు, కొలతల్లో వ్యాపారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రభుత్వ ఆదేశాలు అనుసరించి వస్తున్న మార్పులపై అవగాహనతో పనిచేయాలని కోరారు. వ్యాపారులు, వినియోగదారుల మధ్య మంచి సంబంధాలు కొనసాగే విధంగా చూసుకోవాలని చెప్పారు. వినియోగదాలను గౌరవించాలని సూచించారు. సమావేశంలో డెప్యూటీ కంట్రోలర్ ఐజాక్, రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ కార్యదర్శి రావి శ్రీనివాసరావు, తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఒ.శివరామ్‌ప్రసాద్, మానం నాగేశ్వరరావు, శిరీషా, నరసింహారావు, హనుమంతరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో రైతులకు లాభాలు

ఏపీ రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావు



నూతలపాడులో మిరప పంటను పరిశీలిస్తున్న సీఈఓ రామారావు

పర్చూరు(చినగంజాం): ప్రకృతి వ్యవసాయం సాగు ఎంతో లాభదాయకం అని ఆంధ్రప్రదేశ్ రైతు సాధికార సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ రామారావు పేర్కొన్నారు. మంగళవారం పర్చూరు డివిజన్ పరిధిలో మండలంలోని నూతలపాడులో మిరప పంట పొలాలను ఆయన సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడారు. మిరప పంటల సాగు గురించి ఆయన స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వ్యవసాయం రైతులంతా చేయాలని, దాని వలన రైతులకు ఎన్నో లాభాలు ఉన్నాయని చెప్పారు. దీంతో పాటు పర్యావరణం, ప్రజల ఆరోగ్యానికి ఎంతో ముఖ్యం అని ఆయన రైతులకు దిశానిర్దేశం చేశారు. ఆయన అనంతరం ఏటీఎం మోడల్ పంటను సందర్శించారు. కార్యక్రమంలో డీపీఎం వాణిశ్రీ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, మాస్టర్ ట్రైనీ సీహెచ్ అప్పారావు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- వీసీ ఆచార్య రాజశేఖర్
- పతకాల గ్రహీతలకు సత్కారం



క్రీడాకారులకు నగదు బహుమతులు అందజేస్తున్న వీసీ ఆచార్య రాజశేఖర్, రిజిస్ట్రార్ ఆచార్య కరుణ తదితరులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వైస్ చాన్సలర్ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడా పోటీలలో పతకాలు సాధించిన యూనివర్సిటీ క్రీడాకారులకు మంగళవారం నగదు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి విశ్వవిద్యాలయం సిద్ధంగా ఉందని వెల్లడించారు. విశ్వవిద్యాలయం దూరవిద్య కేంద్రం నుంచి వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్- 2023లో 100 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పథకం సాధించిన జ్యోతికి రూ.లక్ష ఖర్చులతో పాటు మరొక లక్ష రూపాయలను బహుమతిని వీసీ ప్రకటించారు. ఈ ఏడాది మొత్తం ఐదు పథకాలను యూనివర్సిటీ నుంచి క్రీడాకారులు సాధించారన్నారు. జాతీయ, అంతర్జాతీయ క్రీడాపోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులకు అదనంగా మార్కులు ఇచ్చి ప్రోత్సహించే విశ్వవిద్యాలయాల్లో దేశంలోనే మన వర్సిటీ మూడో స్థానంలో నిలిచిందని చెప్పారు. నగదు బహుమతి, స్పోర్ట్స్ స్కాలర్‌షిప్, సూపర్ న్యూమరి సీటు(50 శాతం ఫీజు రాయితీ) వంటివి ముఖ్యమైన ప్రోత్సాహకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ క్రీడలను, విద్యను సమన్వయం పరుచుకుంటూ భవిష్యత్తులో కూడా మరిన్ని విజయాలు సాధించాలని సూచించారు. వ్యాయామ విద్య డైరెక్టర్ ఆచార్య పి.జాన్సన్ మాట్లాడుతూ ఏఎన్‌యూ క్రీడారంగంలో పురోగమిస్తుందన్నారు. గతంలో ఇచ్చిన దానికంటే ఈ ఏడాది నగదు బహుమతిని మొత్తాన్ని పెంచినందుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. యోగా కోఆర్డినేటర్ డాక్టర్ సూర్యనారాయణ మాట్లాడుతూ వ్యాయామ విద్యాశాఖ ఆధ్వర్యంలో 2022 -23 సంవత్సరానికి అంతర్ విశ్వవిద్యాలయాల క్రీడా పోటీల్లోనూ, ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్- 2023 లోను, వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్- 2023 లోను, పతకాలు సాధించిన విశ్వవిద్యాలయ క్రీడాకారులకు నగదు బహుమతి ప్రదానం చేసినట్లు వివరించారు.

మాకూ కావాలి జగన్

- మాకు అందించండి సంక్షేమం
- నినదించిన వలస కార్మిక లోకం
- ఏపీలో ఓటు హక్కు కల్పించి సంక్షేమ ఫలాలు అందించాలని వినతి



బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న వివిధ రాష్ట్రాల భవన నిర్మాణ కార్మికులు

కొరిటిపాడు(గుంటూరు): బిహార్, ఒడిశా, పశ్చిమ బంగ రాష్ట్రాల నుంచి వలస కూలీలుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పనిచేస్తున్న వారంతా ముక్త కంఠంతో 'మాకూ కావాలి జగన్' అంటూ నినదిస్తున్నారని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. వివరాల్లోకి వెళితే గుంటూరు నగరం, నల్లపాడులలో నివశిస్తున్న బిహార్, ఒడిశా, పశ్చిమ బంగ రాష్ట్రాలకు చెందిన సుమారు 500 మంది వలస కార్మికుల కుటుంబాలు బజరంగ్ నిర్మాణంలో ఉన్న గ్రీన్ గ్రేస్ ప్రాజెక్టులో పనిచేస్తున్నారు. వారి ఇరుగుపొరుగులో 200 కుటుంబాల తెలుగువారు ఉన్నారు. వీరంతా ఏపీలో అమలవుతున్న సంక్షేమ పథకాలను పొందుతున్నారు. ఇదంతా చూసిన వలస కార్మికులు తీవ్ర భావోద్వేగానికి గురై, తాము స్వస్థలాలకు తిరిగి వెళ్లబోమని, ఈ సంక్షేమ పాలనలో తమను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. తమ ఆధార్ కార్డులలో చిరునామాను ఇక్కడకు మార్చుకుంటామని, ఇక్కడే తమకు ఓటు హక్కును అనుమతించాలని కోరుతూ బజరంగ్ సీఈఓ అంబటి మురళీకృష్ణ ద్వారా రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి విజ్ఞప్తి చేస్తూ మంగళవారం వినతిపత్రం అందజేశారు.

కౌశల్ పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

- 8 నుంచి పదో తరగతి విద్యార్థులను సిద్ధం చేయండి
- డీఈఓ పీవీజే రామారావు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న డీఈఓ రామారావు

బాపట్ల అర్బన్: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ శాస్త్ర సాంకేతిక మండలి సంయుక్త ఆధ్వర్యంలో కౌశల్- 2023 పరీక్షకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు డీఈఓ పీవీజే రామారావు తెలిపారు. స్థానిక కార్యాలయంలో కౌశల్- 2023 పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కౌశల్ సైన్స్ క్విజ్ పోటీలకు 8,9,10 తరగతుల విద్యార్థులతో క్విజ్ టీమ్ ఏర్పడాలని, ఇది కేవలం ప్రభుత్వ పాఠశాలలకు మాత్రమేనని వెల్లడించారు. ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 8,9,10 తరగతుల గణితం, సైన్స్ 'విజ్ఞాన శాస్త్ర రంగంలో భారతీయుల కృషి మెటీరియల్‌గా నిర్ణయించారని తెలిపారు. ప్రథమ బహుమతిగా రూ.7.500, ద్వితీయ బహుమతిగా రూ.6వేలు, తృతీయ రూ.4,500 అందిస్తారని పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో విజేతలకు ప్రథమ బహుమతి రూ.15 వేలు, ద్వితీయ రూ. 12 వేలు, తృతీయ రూ.9 వేలు అందిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో కన్సొలేషన్ బహుమతులుగా రూ.6 వేలు చొప్పున బహుకరిస్తారన్నారు. పాఠశాల కో-ఆర్డినేటర్లు నవంబర్ 5వ తేదీలోగా విద్యార్థుల పేర్లను డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.బీవీఎం.ఏపీడాట్ ఓఆర్‌జీలో నమోదు చేసుకోవాలని సూచించారు. పోస్టర్ ప్రజెంటేషన్ లో 8, 9 తరగతుల నుంచి ఇద్దరిని అనుమతిస్తామని వెల్లడించారు. వివరాలకు 8121445688 నంబర్ ను గానీ, కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ పావని భానుచంద్రమూర్తి, జిల్లా సైన్స్ అధికారి సాధిక్ మహమ్మద్, నోడల్ అధికారి సికిందర్ మీర్జాన్‌లను సంప్రదించాలని చెప్పారు.

ఓబీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



రేపల్లె: మహిళా రిజర్వేషన్‌ల బిల్లులో ఓబీసీ మహిళలకు దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. పట్టణంలోని శారద ఐటీఐ కళాశాలలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. దేశ చరిత్రలో మహిళా రిజర్వేషన్ బిల్లు అత్యధిక మెజార్టీతో ఆమోదం పొందటం అభినందనీయమన్నారు. మహిళా సాధికారికతకు సమగ్రమైన రూపకల్పనగా బిల్లును రూపొందించకపోవటం శోచనీయమన్నారు. బిల్లులో పొందుపరిచిన విధంగా దేశ వ్యాప్తంగా ఓబీసీ, మైనార్టీ, ఎస్సీ మహిళలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 2026లో జరిగే జనగణనలో ప్రత్యేకంగా బీసీ జనగణన చేయాలన్నారు. లేనిపక్షంలో జన గణనను బీసీ సంఘాలు వ్యతిరేకిస్తాయన్నారు. సమావేశంలో బీసీ సంఘం రాష్ట్ర యువజన అధ్యక్షుడు కుమ్మర క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

పూడ్చిన వివాహిత మృతదేహానికి పోస్టుమార్టం



మృతురాలు పాలపర్తి నాగమణి (ఫైల్)



మృతదేహాన్ని వెలికి తీయిస్తున్న అధికారులు

జే పంగులూరు: సమాధి నుంచి వివాహిత మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించిన ఘటన మండల పరిధిలోని కల్లంవారిపాలెంలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. గ్రామానికి చెందిన పాలపర్తి సాంబశివరావు, పల్నాడు జిల్లాలోని నకరికల్లుకు చెందిన మొగలి ఏసుబాబు, సామ్రాజ్యం మొదటి కుమార్తె నాగమణి (26)ని ఆగస్టు 2023లో ఆమె ఇంటి వద్ద వివాహం చేసుకున్నాడు. ఇద్దరికి రెండో పెళ్లి. అనంతరం ఇద్దరు అదే రోజు పెళ్లి కుమారుడి గ్రామానికి వచ్చారు. మూడో రోజు పెళ్లి కుమార్తె ఇంటికి వెళ్లారు. ఆ రాత్రి గడిచిన తరువాత మరుసటి రోజు పెళ్లి కూతురు పాలపర్తి నాగమణి(26)కి వాంతులు అయ్యాయి. తల్లిదండ్రులు వెంటనే స్థానిక ఆర్ఎంపీ వద్ద రెండు రోజుల పాటు వైద్యం చేయించారు. కొంత కుదుటపడిన తరువాత ఇంటికి బోరింగ్ వద్ద మంచినీరు తీసుకొస్తూ కుప్పకూలి పడిపోయింది. వెంటనే బంధువులు నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ నుంచి మెరుగైన వైద్య నిమిత్తం గుంటూరు వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సెప్టెంబర్ 5న చనిపోయింది. మృతదేహాన్ని అందరి సమక్షంలో పెళ్లి కుమారుడి ఊరు అయిన కల్లంవారిపాలెంలో ఖననం చేశారు. కూతురు చనిపోయిన నెల తరువాత తల్లిండ్రులు అయిన మొగలి ఏసుబాబు, సామ్రాజ్యం తన కూతురుపై విషప్రయోగం జరిగిందని, మాకు న్యాయం చేయాలని నకరికల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కూతురు చనిపోయిన నెల గడిచిన తరువాత మా వద్ద నుంచి రూ. 2 లక్షలు డిమాండ్ చేశారని, అవి ఇవ్వక పోయేసరికి మా మీద అన్యాయంగా కేసు పెట్టినట్లు పెళ్లి కుమారుడి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. అక్కడి పోలీసులు కేసు నమోదు చేశారు. మంగళవారం రిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ పాముల సురేష్ పోస్టుమార్టం చేసి, బాడీ నుంచి అంతర్భాగాలు బయటకు తీసి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. పోస్టుమార్టంలో అద్దంకి మెడికల్ ఆఫీసర్ వాహిని చౌదరి, తహసీల్దార్ ఐ పద్మావతి, ఎస్ఐ తిరుపతిరావు, వీఆర్ఓ అంజియ్య ఉన్నారు.

చంద్రబాబు ఇక జైల్లోనే : ఎమ్మెల్యే ఆర్కే



విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్: ఇక చంద్రబాబు నాయుడు జీవితం జైల్లోనే అని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గుంటూరు జిల్లా తాడేపల్లి సీతానగరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కేను విలేకరులు అడిగిన వాటికి సమాధానం చెబుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాజధాని పేరుతో పేద రైతుల దగ్గర భూ దోపిడీకి ప్రయత్నం చేశారని చెప్పారు. దానికి సంబంధించి అప్పట్లో 40- 50 భూ విషయాలకు సంబంధించి గౌరవ న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో కొంత మేర రైతులకు న్యాయస్థానం అండగా నిలిచి దోపిడీని అడ్డుకుందని వివరించారు. రాజధానిలో ఉన్న చిన్న, సన్నకారు రైతులను అసైన్డ్ భూముల రైతులను రాజకీయాన్ని, అధికారులను అడ్డం పెట్టుకుని బెదిరించి వారి భూములను అతి తక్కువ ధరకు కొనుగోలు చేశారని, ఇప్పుడు వారి ఉసురే ఆయనకు తగిలిందని, మొదటి నుంచి చంద్రబాబు నాయుడు దోపిడీపై మేము పోరాటం చేస్తూనే ఉన్నామని, ఎట్టకేలకు ఆయన అవినీతి బాగోతాలు ఒక్కటొక్కటిగా బయటకు వస్తున్నాయని, ఇక ఆయన జైలుకే అంకితం అవుతారని అన్నారు.

అధికారంలో ఉన్నప్పుడు ఐఏఎస్ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి..

ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలను మోసం చేశారని, అందుకు సంబంధించి 2019, 2020లో కేసులు గౌరవ న్యాయస్థానం పరిగణలోకి తీసుకోవడం, ఇప్పుడు చంద్రబాబును దోషిగా నిలబెట్టడానికి ఎంతగానో ఉపయోగపడ్డాయని ఆయన అన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావును వెన్నుపోటు పొడిచినప్పుడు కొంతమంది నాయకులు చంద్రబాబుకు అండగా నిలిచారని, అలాంటి వారు ఇప్పుడు ప్రజల పక్షాన ఏ విధంగా నిలుచుంటారో మనం దరం ఆలోచించాలని అన్నారు. 2014లో శ్రీకృష్ణ కమిటీ ఇచ్చిన నివేదికకి విరుద్ధంగా ఆయన వ్యాపారాల కోసం ఇక్కడ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ రైతులను మోసం చేసేందుకు భూ దోపిడీకి తెరలేపారని చెప్పారు. అక్రమంగా భూమిని దోచుకున్నారని, 1943-44లో అసైన్డ్ చేసిన భూములు కలిగిన రైతులను అధికారులతో, రాజకీయ నాయకులతో బెదిరించి రెండు మూడు లక్షలకు కొనుగోలు చేశారని వివరించారు. అనంతరం జీవో నంబర్ 41ను తీసుకువచ్చి కొనుగోలు చేసిన ఆయన బినామీలకు లబ్ధి చేకూరే విధంగా చేసి రైతులను మోసగించారని ఆయన అన్నారు.

సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా టెక్స్‌టైల్ రంగం

పట్నంబజారు: కరోనా తర్వాత దేశంలోనే సంక్షోభం బారిన పడిన అనేక రంగాలలో టెక్స్‌టైల్ రంగం కూడా ఒకటని శాసనమండలి శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. ఈ రంగాన్ని ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక సంస్కరణలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. శాసన మండలిలో ప్రభుత్వ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన అప్పిరెడ్డిని ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం విద్యానగర్‌లోని ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సత్కరించారు. ఇందులో భాగంగా టెక్స్‌టైల్ పరిశ్రమలు పూర్తిగా సంక్షోభంలో కూరుకుపోయాయని అసోసియేషన్ సభ్యులు విప్ అప్పిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వమే తమ రంగానికి అండగా నిలవాలని, తమ సమస్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లి పరిష్కరించేందుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఇప్పుడిప్పుడే టెక్స్‌టైల్ రంగం సంక్షోభం నుంచి సంక్షేమం దిశగా అడుగులు వేస్తోందని, ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే వాటిని పరిష్కరించేందుకు సీఎం వైఎస్ జగన్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు వెల్లడించారు. సీఎం జగన్ ఆలోచనా విధానానికి అనుగుణంగా రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, అసోసియేషన్ చైర్మన్ పెరవలి కోటిరావు, సాదినేని కోటేశ్వరరావు, మాజీ చైర్మన్ గోరంట్ల పున్నయ్య చౌదరి, అసోసియేషన్ గౌరవ చైర్మన్ లంకా రఘురామిరెడ్డి, వైస్ చైర్మన్లు సామినేని కోటేశ్వరరావు, ఎం.వి.సత్యనారాయణ, పూర్ణ వీరయ్య, కళ్ళం నాగిరెడ్డి, బత్తినేని బెనర్జీ, కార్యదర్శి మల్లేశ్వర కుమార్, కోశాధికారి చలపతిరావు పాల్గొన్నారు.

27న ఓటర్ల ముసాయిదా జాబితా

గుంటూరు నగర కమిషనర్ కీర్తి చేకూరి ఆదేశం

నెహ్రూనగర్: క్షేత్ర స్థాయిలో బీఎల్ఓలు చేసిన ఇంటింటి సర్వేలో సేకరించిన ఫారాలను ఏఈఆర్‌ఓలు ప్రత్యక్షంగా పరిశీలించాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ ఈఆర్‌ఓ కీర్తి చేకూరి ఆదేశించారు. మంగళవారం కమి షనర్ చాంబర్‌లో ఎన్నికల విభాగ విధుల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ నెల 27కి ఓటర్ల ముసాయిదా జాబితా విడుదల కానున్నదని, నగరంలోని రెండు నియోజక వర్గాల్లో బీఎల్ఓలు ఇంటింటి సర్వేలో వచ్చిన ఫారాలను ఏఈఆర్‌ఓలు నేరుగా పరిశీలించాలన్నారు. ఫారాల్లో తప్పనిసరిగా అర్జీదారు, బీఎల్ఓ, సూపర్‌వైజర్ అధికారి సంతకాలు, రిమార్క్స్ ఉండాలన్నారు. పోలింగ్ స్టేషన్ల వారీగా ఏమైనా అర్జీలు ఆన్ లైన్ చేయకుండా పెండింగ్ ఉంటే వాటిని వెంటనే పూర్తి చేయాలన్నారు. ఎన్నికల విధులు ఎంతో అప్రమత్తంగా నిర్వహించాలని, నిర్లక్ష్యంగా ఉండే వారి పై కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. పెండింగ్ ఫారాలను ఈ నెల 27 తర్వాత ఆన్ లైన్ చేయాల్సి ఉంటుందని, అందుకు తగిన విధంగా సూపర్‌వైజరి అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో అదనపు కమిషనర్ (ఇన్‌చార్జి) సి.హెచ్.శ్రీనివాస్, డెప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, సిటి ప్లానర్ ప్రదీప్ కుమార్, డెప్యూటీ సిటీ ప్లానర్ కోటయ్య, సూపరింటెండెంట్లు సాంబశివరావు, ప్రసాద్, పద్మ పాల్గొన్నారు.

అనుమతులు లేని జీవ ఎరువులు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న ఉత్పత్తులను చూపుతున్న అధికారులు

మేదరమెట్ల: అనుమతులు లేని బయో ఉత్పత్తులను అమ్ముతున్న వ్యక్తిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం కేసు నమోదు చేశారు. వివరాలు.. కొరిశపాడు మండలంలోని మేదరమెట్లలో గొంగోలు ధనుంజయ, ఆర్గానిక్ అండ్ నాచురల్స్ పేరుతో ఉత్పత్తులు తయారు చేస్తున్నాడు. వీటికి అనుమతులు లేవు. దీంతో అధికారులు తనిఖీ నిర్వహించి రూ.22.93 లక్షల విలువ చేసే బయో స్టిములెంట్స్(జీవ ఉత్ప్రేరకాలు)ను స్వాధీనం చేసుకున్నారు. 6-ఏ కేసు నమోదు చేశారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అగ్రికల్చర్ ఆఫీసర్ కే రమణ కుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ రామచంద్రయ్య, స్థానిక వ్యవసాయాధికారి శ్రీనివాసరావు ఉన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

తెనాలిరూరల్: హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు వివరాలు.. దుగ్గిరాల మండలం చిలువూరుకు చెందిన కాబోతు పూర్ణశేఖర్ 2019 మే 14వ తేదీన వైన్ షాప్‌వద్ద మద్యం తాగుతుండగా అతని బంధువు సన్నెకంటి నరేష్‌బాబు అలియాస్ నరేష్ అక్కడికి వచ్చి తనకు మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. అందుకు అతను నిరాకరించడంతో ఘర్షణ పడి పక్కనే ఉన్న బీరు సీసాను పగులగొట్టి గొంతులో పొడవడంతో పూర్ణశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసును దుగ్గిరాల పోలీసులు నమోదు చేయగా అప్పటి తెనాలి రూరల్ సీఐ యు.సుధాకరరావు కేసు దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరు పరిచారు. కేసు మంగళవారం విచారణకు రావడంతో సాక్ష్యాధారాలను పరిశీలించిన 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి జి.మాలతి, నిందితుడు నరేష్‌కు యావజ్జీవ కఠిన కారాగార శిక్ష, రూ. వెయ్యి జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో ఆరు నెలల సాధారణ జైలు శిక్ష అనుభవించాలన్నారు. ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ దాట్ల మోహన్‌రెడ్డి వాదించారు.

చోరీ చేసి దొరికిపోయిన నిందితుడు

తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ పోతురాజు, సీఐ వాసు

మేడికొండూరు: మండల పరిధిలోని భీమినేని వారి పాలెంలో ఈనెల 10న పట్టపగలు ఓ ఇంట్లో చోరీ జరిగింది. గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి ప్రవేశించి మహిళలపై దాడి చేశారు. బీరువాలో ఉన్న నగదు అపహరించుకు పోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు తక్కువ సమయంలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తుళ్లూరు డీఎస్పీ పోతురాజు మంగళవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిందిగుడి నుంచి మూడు రాబరి, ఐదు ద్విచక్ర వాహనాల చోరీతోపాటు, పాటేలు చోరీ కేసులు ఉన్నట్లు తెలిపారు. నేర చరిత్ర ఉన్న వ్యక్తిగా వెల్లడించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలోని లెనిన్ కాలనీకి చెందిన కె.దుర్గాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు. మరో వ్యక్తి పిడుగురాళ్ల ఆదర్శ కాలనీకి చెందిన శేషగిరి అలియాస్ ఎలిషా పరారీలో ఉన్నట్లు, అతని కోసం పోలీసులు గాలిస్తున్నట్లు వెల్లడించారు. చోరీ జరిగిన వారం రోజుల్లోపు కేసును ఛేదించడంలో ప్రతిభ కనబర్చిన మేడికొండూరు సీఐ వాసు, ఎస్సై మధుపవన్, పీసీలు జి.సిద్ధయ్య, వై.మాణిక్య రావు, షేక్ నజీర్, ఒ.డేవిడ్, కె.రామారావు, కానిస్టేబుళ్లను గుంటూరు ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ అభినందనలు తెలిపి రివార్డులు ప్రకటించారు. రివార్డులు డీఎస్పీ పోతురాజు పంపిణీ చేశారు.